
సాక్షి
కాకినాడ
బుధవారం । 18 । జనవరి । 2023



డెల్టాలకు నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టాలకు మంగళవారం నీటి విడుదలను పెంచారు. మొత్తం 8,970 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు 2,650, సెంట్రల్ 1,720, పశ్చిమ డెల్టాలకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.65 అడుగులకు చేరింది.



నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి అన్నవరం గ్రామానికి చెందిన దాసరి వెంకట సత్యప్రసాద్ మంగళవారం రూ.1,01,963 విరాళం సమర్పించారు.

నేడు జెడ్పీ బడ్జెట్ సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ బడ్జెట్ సమావేశం బుధవారం జెడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జరగనుంది. జెడ్పీ సీఈఓ ఎన్వీవీ సత్యనారాయణ మంగళవారం ఈ విషయం తెలిపారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల చెందిన జిల్లా అధికారులు పాల్గొంటారు.

న్యూస్‌రీల్

జాతీయ ఆర్చరీ పోటీల్లో రజతం



దేవాన్ని

కిర్లంపూడి: జగపతినగరం గ్రామానికి చెందిన అళ్ల దేవాన్ని జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపింది. ఇటీవల విజయవాడ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అండర్-9 జాతీయ ఆర్చరీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన ఆమె రజత పతకం సాధించింది. దేవాన్ని రాజమహేంద్రవరం ఢిల్లీ పబ్లిక్ స్కూలులో రెండో తరగతి చదువుతోంది. దేవాన్నిని కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గుండెపోటుతో ఎంపీడీఓ హఠాన్మరణం



ప్రభాకర రామారావు (పాతచిత్రం)

కొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ నందూరి ప్రభాకర రామారావు (50) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన రెండేళ్లుగా సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన వసంత మాధవి ఉపాధి హామీ పథకం ఏపీడీగా బదిలీ కావడంతో ప్రభాకర రామారావు ఆరు నెలలుగా ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన హఠాన్మరణం పట్ల పలువురు సంతాపం తెలిపారు. మండల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న రామారావు మృతి తీరని లోటని పేర్కొన్నారు. రామారావు కుటుంబ సభ్యులను డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచ్‌లు నక్కా మణికంఠబాబు, కర్రి చిన్నారావు, పాలాని దొరబాబు, మత్స్యకార నాయకులు ఉమ్మిడి జాన్, కంబాల లక్ష్మణ్, ఎంపీటీసీ అనిశెట్టి సుభాషిణి తదితరులు పరామర్శించి, సానుభూతి తెలిపారు.

నేడు దిశ సమావేశం

కాకినాడ సిటీ: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ వంగా గీత అధ్యక్షతన బుధవారం సాయంత్రం 4 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుంది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

జిల్లా పరిషత్

- ఉత్తమ గ్రేడ్‌ల కోసం కసరత్తు
- జెడ్పీ హైస్కూళ్లలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్
- 'జగనన్న విద్యా భారతి' పేరుతో నేటి నుంచి పంపిణీ
- ఉమ్మడి 'తూర్పు'న 48,727 మందికి ప్రయోజనం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా.. 'జగనన్న విద్యా భారతి' పేరిట స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ నిర్ణయించింది. తద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులు ఉత్తమ గ్రేడ్‌లలో ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దేందుకు నడుం బిగించింది. ఇప్పటికే జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. దీనికి కొనసాగింపుగా కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 48 వేల మందికి పైగా టెన్త్ విద్యార్థులకు మేలు చేకూర్చే బృహత్తర కార్యక్రమాన్ని జెడ్పీ చేపట్టింది.

ప్రతి విద్యార్థీ పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగానే ఉన్నత చదువులకు వెళ్తారు. పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఐదేళ్లుగా తొలి మూడింటిలో ఏదో ఒక స్థానం సాధిస్తూ వస్తోంది. కోవిడ్‌తో విద్యార్థులు రెండేళ్లుగా చదువుకు దూరమయ్యారు. అదే సమయంలో పదో తరగతి పరీక్షలు జరగకపోవడం, పాఠశాలలో మార్కుల ఆధారంగా గ్రేడు పాయింట్లు రావడం వంటి కారణాలతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి పరీక్షల విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసింది. బుక్‌లెట్‌ను అందుబాటులోకి తెచ్చి, ప్రతి పేపర్ స్కాన్ చేసేలా బార్‌కోడ్ విధానం ప్రవేశపెట్టింది. ప్రతి సెంటరులో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి మరింత భద్రతతో పరీక్షలు నిర్వహించనుంది. ఈ పరిస్థితుల్లో జెడ్పీ హైస్కూళ్లలో ప్రతి టెన్త్ విద్యార్థి విద్యా ప్రమాణాలనూ పెంచేందుకు వీలుగా 'జగనన్న విద్యా భారతి' స్టడీ మెటీరియల్ అందజేయాలని జిల్లా పరిషత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యాన సిబ్బంది చురుకుగా చేస్తున్నారు. ఈ స్టడీ మెటీరియల్ పంపిణీకి బుధవారం శ్రీకారం చుట్టనున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో విద్యార్థుల వివరాలు

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
కాకినాడ	9,896	10,589	20,485
తూర్పు గోదావరి	4,475	4,708	9,183
అల్లూరి సీతారామరాజు	2,069	2,287	4,356
కోనసీమ	7,381	7,372	14,753
మొత్తం	23,821	24,906	48,727

నిపుణులైన అధ్యాపక బృందంతో..

ఎస్‌సీఈఆర్‌టీ గుర్తింపు పొందిన నిపుణులైన ప్రభుత్వ పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులతో ఈ స్టడీ మెటీరియల్ రూపొందించారు. టెన్త్ విద్యార్థులను ప్రస్తుతం ఎ, బి, సి గ్రేడులుగా విభజించి తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా పరీక్షల విభాగం, గుంటూరులో పదో తరగతి మెటీరియల్ రూపొందించిన ఉపాధ్యాయ బృందం సలహాలు తీసుకుని.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో అన్ని సబ్జెక్టులకూ 'జగనన్న విద్యా భారతి' స్టడీ మెటీరియల్ రూపొందించారు. ప్రశ్నలు, జవాబులు, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో సరళమైన విధానంలో దీనికి రూపకల్పన చేశారు. విద్యార్థులకు ఇట్టే అర్థమయ్యేలా తయారు చేశారు. ఈ మెటీరియల్‌ను ప్రతి ప్రభుత్వ పాఠశాలలోని టెన్త్ విద్యార్థికీ పూర్తి ఉచితంగా ఇవ్వనున్నారు. పరీక్షలకు ఇంకా రెండున్నర నెలల సమయం ఉన్నందున ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని, తద్వారా ఉమ్మడి జిల్లాను రాష్ట్రంలో నంబర్-1గా నిలపాలని జెడ్పీ లక్ష్యంగా నిర్దేశించుకుంది.



పంపిణీకి సిద్ధంగా..



జగనన్న విద్యా భారతి స్టడీ మెటీరియల్

విద్యార్థుల ప్రయోజనం కోసమే..



విద్యార్థులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకే ఈ స్టడీ మెటీరియల్‌ను తయారు చేయించాం. రెండేళ్లుగా ఈ మెటీరియల్ ఇవ్వాలని అనుకున్నా కోవిడ్ కారణంగా అమలు చేయలేకపోయాం. కోవిడ్ నుంచి బయటపడి ఇప్పుడిప్పుడే పరిస్థితులు గాడిన పడుతున్నందున విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే సంకల్పంతోనే స్టడీ మెటీరియల్ తయారు చేయించాం.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి

స్టడీ మెటీరియల్ సిద్ధం



'జగనన్న విద్యా భారతి' స్టడీ మెటీరియల్‌ను బుధవారం జరిగే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆవిష్కరించనున్నాం. దీనిని మండలాల్లో జెడ్పీటీసీ సభ్యుల ఆధ్వర్యాన పంపిణీ చేయాలని ఎంపీడీఓ, ఎంఈఓలను ఇప్పటికే ఆదేశించాం.

– ఎస్.సత్యనారాయణ, సీఈఓ, జిల్లా పరిషత్, కాకినాడ

రద్దీగా రత్నగిరి



సత్యదేవుని దర్శనానికి ఆలయం వద్ద వేచి ఉన్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి మంగళవారం రద్దీగా మారింది. సంక్రాంతి సెలవులకు వివిధ ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చిన వారు సత్యదేవుని దర్శించేందుకు వందలాది వాహనాల్లో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, ఘాట్ రోడ్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించారని అధికారులు తెలిపారు. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. వ్రతాలు 2 వేలు జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు.

అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. అన్నదాన పథకంలో ఐదు వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. ఏకాదశి పర్వదినం కావడంతో బుధవారం కూడా ఆలయం భక్తులతో కిటకిటలాడనుంది.

కిడ్నీ బాధితునికి కలెక్టర్ భరోసా



కిడ్నీ బాధితుడు రాము తండ్రితో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా. చిత్రంలో డీఎంహెచ్‌ఓ శాంతిప్రభ

కాకినాడ సిటీ: కోటనందూరు మండలం ఎస్ఆర్ పేటకు చెందిన కిడ్నీ బాధితుడు అన్నంరెడ్డి రాముకు కలెక్టర్ కృతికా శుక్లా భరోసా ఇచ్చారు. ఏడాది కాలంగా అతడు కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాడు. కొద్ది రోజుల కిందట అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పర్యటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి, తన సమస్య వివరించి, ఆదుకోవాలని కోరాడు. రాము నిస్సహాయ స్థితికి చలించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అతడికి వైద్య సహాయం అందించాల్సిందిగా కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు సూచించారు. ఈ మేరకు తండ్రి సహాయంతో రాము కలెక్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో కలిశాడు. అతడి చికిత్స ఏర్పాట్లపై కలెక్టర్ కోటనందూరు వైద్యాధికారి, జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి శాంతిప్రభతో కలెక్టర్ చర్చించారు. సత్వరమే కోలుకునేలా రాముకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అతడి చికిత్సకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం తరఫున అందజేస్తామని రాము తండ్రికి భరోసా ఇచ్చారు. తన సమస్యపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, కలెక్టర్ కృతికా శుక్లాకు రాము కృతజ్ఞతలు తెలిపాడు.

ఈ-హాజరుకు శ్రీకారం

- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ప్రారంభం
- ఆఫీసు ఆవరణలోనే సిబ్బంది విధిగా నమోదు

కాకినాడ సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగుల సమయ పాలనను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఈ-హాజరు(ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్)కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విధానం అమలు చేస్తున్న ప్రభుత్వం ఈ నెల 16 నుంచి అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ దీనిని అమలులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు నూతన సాంకేతికతతో కూడిన మొబైల్ యాప్‌తో ఫేషియల్ రికగ్నిషన్(ముఖ ఆధారిత హాజరు)కు రూపకల్పన చేశారు. దీని ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల అధికారులు, సిబ్బంది ఈ-అటెండెన్స్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ-హాజరు నమోదులో భాగంగా ఇప్పటికే జిల్లాలోని అన్ని శాఖల సమగ్ర సమాచారాన్ని సంబంధిత యాప్‌లో నమోదు చేశారు. సచివాలయ సిబ్బందికి కూడా ఇటీవలే ఈ-కేవైసీ ప్రక్రియ వేగవంతం చేశారు. ఇక నుంచి అధికారుల వేతనాలకు ఇదే ప్రాతిపదిక కానుంది. ఈ-హాజరు అమలు చేస్తున్న అటెండెన్స్ యాప్‌కు జీపీఎస్ అనుసంధానం చేశారు. జిల్లా వ్యాప్తంగా 24 వేల మందికి పైగా ఉద్యోగులు ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ పరిధిలోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో అధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకూ సుమారు 2,500 మంది ముఖ ఆధారిత హాజరుకు ప్రయత్నించారు. దీనిని ప్రయోగాత్మకంగా ప్రారంభించామని, సాంకేతిక ఇబ్బందులు అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఈ-హాజరు విధానం అన్ని ప్రభుత్వ శాఖల్లో సిబ్బంది సమయ పాలనకు, పనితీరు మెరుగుదలకు ఎంతో దోహదపడుతుందని కొంతమంది అధికారులు చెబుతున్నారు. సమయానికి రాని సిబ్బందిని ఇకపై అడగాల్సిన పని ఉండదని, తొలుత కొందరికి కష్టమనిపించినా భవిష్యత్తులో మంచి ఫలితాలుంటాయని వివిధ శాఖల జిల్లా అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ముఖ ఆధారిత హాజరు వేస్తున్న కాకినాడ నగరపాలక సంస్థ సిబ్బంది

నేటి నుంచి ఆర్మీ, నేవీ సంయుక్త విన్యాసాలు

- ఐదు రోజుల పాటు బీచ్ రోడ్డు మూసివేత
- విన్యాసాల్లో పాల్గొంటున్న 5 యుద్ధనౌకలు

కాకినాడ రూరల్/పిఠాపురం: కాకినాడ సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్ వద్ద ఇండియన్ ఆర్మీ, నేవీ అధికారులు బుధవారం ఆంఫీబియస్ విన్యాసాలు ప్రారంభించనున్నారు. కాకినాడ బీచ్‌తో పాటు హోప్ ఐలాండ్‌లో కూడా ఐదు రోజుల పాటు ఈ విన్యాసాలు జరుగుతాయి. శత్రుదేశాలు దాడులు చేసినప్పుడు వాటిని ఏవిధంగా తిప్పికొట్టాలనే అంశంతో సైనికులు, నావికులు ఈ విన్యాసాల్లో తమ పోరాట ప్రతిభ చాటనున్నారు. ఈ విన్యాసాల కోసం నేవీ హెలికాప్టర్లతో పాటు ఐఎన్ఎస్ జలాశ్వ, ఐరావత్ వంటి ఐదు యుద్ధనౌకలు ఇక్కడకు రానున్నాయి. నేవీ అధికారులు నేవల్ ఎన్‌క్లేవ్‌కు మంగళవారం సాయంత్రం చేరుకుని, ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ విన్యాసాల నేపథ్యంలో కాకినాడ – ఉప్పాడ బీచ్‌రోడ్డును బుధవారం ఉదయం నుంచి 23వ తేదీ సాయంత్రం వరకూ మూసివేయనున్నారు. బీచ్ రోడ్డులో వెళ్లే వాహనాలను అచ్చంపేట జంక్షన్ నుంచి పిఠాపురం మీదుగా ఉప్పాడ వైపు మళ్లిస్తారు. తుని నుంచి బీచ్ రోడ్డులో వచ్చే వాహనాలను కూడా ఉప్పాడ నుంచి పిఠాపురం మీదుగా మళ్లిస్తారు. ఈ విన్యాసాల కారణంగా బీచ్ రోడ్డును మూసివేస్తున్నందున ఈ ఐదు రోజులూ ప్రజలు సహకరించాలని కాకినాడ రూరల్, పిఠాపురం సీఐలు శ్రీనివాస్, వైఆర్‌కే శ్రీనివాస్ కోరారు.

పంపిణీ పక్కాగా..

- లబ్ధిదారులకే పౌష్టికాహారం అందేలా చర్యలు
- అంగన్‌వాడీల్లోనే రుచికరమైన భోజన
- జిల్లాలో 1.15 లక్షల మందికి ప్రయోజనం

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు :	10
మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు :	1,927
మినీ కేంద్రాలు :	59
మొత్తం కేంద్రాలు :	1,986
వీటి ద్వారా సేవలు పొందుతున్న వారు :	1,15,661
6 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు :	61,354
ఆరేళ్ల లోపు చిన్నారులు :	30,527
గర్భిణులు :	12,611
బాలింతలు :	11,169

కాకినాడ సిటీ: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి పొరపాట్లకూ తావు లేకుండా చూస్తోంది. ముఖ్యంగా వారికి అందిస్తున్న సరకులు, ఆహారం ఎలా వినియోగించుకుంటున్నారు, వాటి వల్ల కలుగుతున్న ప్రయోజనాలను నిరంతరం పర్యవేక్షిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద రేషన్ సరకులతో పాటు గుడ్లు, రాగి పిండి, పాలు, బెల్లం, చిక్కీలు అందించడమే కాకుండా, అవి సద్వినియోగమయ్యేలా చూస్తోంది. రెండేళ్ల క్రితం కరోనా ప్రభావంతో అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి, అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు ఇంటి వద్దనే రేషన్ సరకులు అందించేవారు. అయితే వీటిని లబ్ధిదారులే కాకుండా కుటుంబ సభ్యులందరూ వినియోగించుకుంటున్నారని, దీనివల్ల ఆయా ఇళ్లల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నారని గుర్తించారు. ఈలోగా కోవిడ్ ప్రభావం తొలగిపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలను తిరిగి ప్రారంభించి, రేషన్ సరకులతో పాటు అన్నం, పప్పు, ఆకుకూరలు, ఇతర తినుబండారాలు అక్కడే అందిస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న గర్భిణులు (ఫైల్)

సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు మధ్యాహ్నం భోజనం, ఇతర పౌష్టికాహారాన్ని సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో పంపిణీ చేస్తున్నారు. ఆయా సరకులను సక్రమంగా వినియోగించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. పౌష్టికాహార లోపాలున్న గర్భిణులు, బాలింతలను గుర్తించి ఫోలిక్ యాసిడ్ మాత్రలు కూడా అందిస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ఒక్కో చిన్నారికి నెలకు 2 కేజీల బియ్యం, కందిపప్పు 800 గ్రాములు, వంట నూనె 200 మిల్లీలీటర్లు, 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలు అందిస్తున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు నెలకు 4 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ వంట నూనె, 5.200 లీటర్ల పాలు పంపిణీ చేస్తున్నారు. దీనిని 26 రోజులకు విభజించి వంట చేసి, అందిస్తున్నారు.

మంచి ఆహారం అందిస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మంచి ఆహారం అందిస్తున్నారు. నాణ్యతతో వండి పెడుతున్నారు. దీంతో పాటు చిక్కీలు, రాగి పిండి కూడా ఇస్తున్నారు. వైద్య సలహాలు అందిస్తున్నారు.

– సకల సాయి సంధ్య, ఏఎస్ఆర్ కాలనీ, తూరంగి

లబ్ధిదారులకు ఉపయోగపడేలా చర్యలు



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులే వినియోగించుకోవాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. ఎక్కడైనా ఇబ్బందులుంటే సమీప సూపర్‌వైజర్, సీడీపీఓలకు ఫిర్యాదు చేయాలి.

– కె.ప్రవీణ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



మొన్నటి వరకూ సరకులు ఇంటి వద్దకే వచ్చి అందించారు. వాటిని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవడం లేదని తెలిసి ఇప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం వండి పెడుతున్నారు. చిన్న పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలకు కూడా అక్కడే వడ్డిస్తున్నారు. మంచి ఆహారం అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. – వానపల్లి వరలక్ష్మి, తూరంగి, కాకినాడ రూరల్

ఖాళీల వివరాలు తెలపాలి

కాకినాడ సిటీ: గ్రామ/వార్డు సచివాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వనున్నదని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఆయా శాఖల్లో ఖాళీల వివరాలను వెంటనే రోస్టర్ ప్రకారం ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రోస్టర్ విధానం రిజిస్టర్ల పరిశీలనకు కమిటీని నియమించనున్నామని, దీని ద్వారా అన్ని శాఖల అధికారులూ రోస్టర్ రిజిస్టర్లను పరిశీలన చేయించుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఎన్వీవీ సత్యనారాయణ, డీఆర్ఓ కె.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌నాయక్ జీవన సాఫల్య పురస్కారానికి డాక్టర్ గన్ని ఎంపిక


డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాల, ఆస్పత్రి అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావును లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారం వరించింది. ఆయన జీఎస్ఎల్ కళాశాల ద్వారా ఎందరినో వైద్యులుగా తీర్చిదిద్దడంతో పాటు, అనుబంధంగా ఏర్పాటు చేసిన జనరల్ ఆస్పత్రి, రాజమహేంద్రవరంలోని స్వతంత్ర ఆస్పత్రి ద్వారా ఎందరో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. సర్జన్‌గా, ప్రొఫెసర్‌గా ఖ్యాతికెక్కారు. విశాఖపట్నంలోని సిరిపురం వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో బుధవారం జరిగే కార్యక్రమంలో ఆయనకు జీవన సాఫల్య పురస్కారం అందించనున్నామని ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ గన్నితో పాటు కూచిభొట్ల ఆనంద్ (అమెరికా), కె.సత్యనారాయణ (విజయవాడ) కూడా జీవన సాఫల్య పురస్కారాలు అందుకోనున్నారు. ఇదే కార్యక్రమంలో సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, నటీమణులు జయసుధ, జయప్రదలకు ఎన్టీఆర్ శతజయంతి పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.


అందమైన అక్షరాలు.. మార్కులకు మార్గాలు

- దస్తూరీపై విద్యార్థులు దృష్టి పెడితే మేలు
- సమీపిస్తున్న పది, ఇంటర్ పరీక్షలు

రాయవరం/కాకినాడ సిటీ: అక్షరాలు అందంగా, గుండ్రంగా ఉన్న రాతను చూస్తే ఎవరైనా ముచ్చట పడతారు. మన చేతిరాతను బట్టి కూడా మన మనస్తత్వాన్ని, గుణగణాలను కూడా అంచనా వేయవచ్చునని నిపుణులు చెబుతారు. చేతిరాత అందంగా ఉన్నప్పుడే విద్యార్థులు మంచి మార్కులను పొందే వీలుంటుంది. మార్చిలో ఇంటర్, ఏప్రిల్‌లో పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో చేతిరాతపై ఇప్పటి నుంచే దృష్టి సారిస్తే మంచి మార్కులను సాధించే వీలుంటుంది.

సమీపిస్తున్న సమయం

ఇప్పటికే పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల టైమ్ టేబుల్‌ను సెకండరీ, మాధ్యమిక విద్యాశాఖ విడుదల చేశాయి. మార్చి 15 నుంచి పది, ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. డిగ్రీ, వృత్తి విద్యా కోర్సుల వార్షిక పరీక్షలు మరికొద్ది నెలల్లో రానున్నాయి. విద్యార్థులు



అందమైన చేతిరాత

మార్కులు, గ్రేడులు సాధించడానికి ప్రణాళికలు రూపొందించుకుంటారు. చేతిరాత గురించి మాత్రం పట్టించుకోరు. దీంతో అనుకున్న మార్కులు పొందలేక పోతుంటారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతను పెంచుకుంటే మంచి రాత వస్తుంది. ఏడాది పొడవునా చదివిన పాఠ్యాంశాలపై పరీక్షల్లో వచ్చే ప్రశ్నలకు విద్యార్థి అందంగా రాసే సమాధానాలపై ఎన్ని మార్కులు వస్తాయనేది ఆధారపడి ఉంటుంది.

స్పష్టంగా రాయాలి

- ప్రతి విద్యార్థి జవాబు పత్రాల్లో సమాధానాలను స్పష్టంగా రాయాలి.
- పేపరుకు నాలుగు వైపులా బోర్డర్ వేసుకుంటే చూసేందుకు అందంగా ఉంటుంది.
- పరీక్షల్లో రాసే అక్షరాలు ఒకేలా ఉండాలి.
- అక్షరాలు మరీ పెద్దవి, చిన్నవిగా ఉండకూడదు.
- పేపరంతా ఒకే స్థాయిలో అక్షరాలు ఉండాలి. చేతిరాత బాగుంటే జవాబు పత్రాలను దిద్దే ఉపాధ్యాయుడు ప్రభావితమవుతారు.
- అక్షరాలు గుండ్రంగా, అందంగా ఉంటే మంచి మార్కులు పొందడానికి అవకాశం ఉంటుంది.
- ఒక లైనుకు మరో లైనుకు సెంటీమీటరు గ్యాప్ ఇవ్వాలి.
- పదానికి, పదానికి తగినంత (ఒకటి లేదా రెండు అక్షరాలు) స్పేస్ ఇవ్వాలి.
- వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో ఉండాలి. బొటన వేలు, మూడవ వేలికి మధ్య చూపుడు వేలు సహాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వలన రాసే సమయంలో పెన్ను స్పీడుగా ముందుకు కదులుతుంది.
- ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై పడుతుంది.

రోజూ ప్రాక్టీస్ చేయాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 70,420 మంది విద్యార్థులు వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంటర్‌కు 1,00,475 మంది పరీక్షలు రాయనున్నారు. ఇప్పటి నుంచే పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఇటు సబ్జెక్టులకు సన్నద్ధం అవుతూ మరోవైపు రోజులో కొంత సమయం చేతిరాతపై దృష్టి సారిస్తే రాతపై పట్టు వస్తుంది. రోజుకు అరగంటైనా చేతిరాతపై ప్రాక్టీస్ చేయాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు దృష్టి సారించాలి.

సమయం కేటాయించాలి



చక్కటి చేతిరాత సాధనతోనే సాధ్యం కాగలదు. పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు అక్షరాలను అందంగా రాసేందుకు సమయం కేటాయించుకోవాలి. చాలా మంది తొలి ప్రశ్నకు గుండ్రటి అక్షరాలతో సమాధానం రాస్తారు. తరువాత సమయం అయిపోతుందన్న ఆందోళనతో వేగంగా రాస్తారు. అందువల్ల గుండ్రటి అక్షరాలు కుదరవు. ఈ ప్రభావం మార్కులపై పడుతుంది. అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి.

– కె.విజయదుర్గ, ప్రధానోపాధ్యాయురాలు, జెడ్పీ హైస్కూల్, తూరంగి, కాకినాడ రూరల్ మండలం

సందేహం లేదు..



పరీక్షల్లో అందమైన చేతిరాతకు అదనపు మార్కులు పడతాయనడంలో సందేహం లేదు. చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం.

– పీవీఆర్ ప్రసాద్, జెడ్పీహెచ్ఎస్, చింతల్లంక, అయినవిల్లి మండలం

సాధన తప్పనిసరి



సాధనతోనే చక్కటి చేతిరాత సాధ్యమవుతుంది. పరీక్షల్లో తొలి ప్రశ్న నుంచి చివరి ప్రశ్న వరకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి.


– పలివెల సూర్యభద్ర శివకామ సుందరి, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, ద్రాక్షారామం

జాంపండు మాస్టారు కన్నుమూత


రామవీరేశ్వరశర్మ (ఫైల్)

సీటీఆర్ఐ: జాంపండు మాస్టారుగా నగరవాసులకు చిరపరిచితుడైన డాక్టర్ మారేపల్లి రామవీరేశ్వరశర్మ (85) మంగళవారం కన్నుమూశారు. జాంపండు మీద పద్యం చెప్పడంతో ఆయనను అందరూ జాంపండు మాస్టారు అని గౌరవంగా పిలిచేవారు. గౌతమీ ఓరియంటల్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా సేవలు అందించిన శర్మ.. వాస్తు, జ్యోతిష, ప్రశ్న విభాగాలలో నిపుణుడు. సూత్రధారులు తదితర సినిమాలలో నటించారు.

రఘు కుంచెకు పితృవియోగం


లక్ష్మీనారాయణరావు (ఫైల్)

మధురపూడి: తెలుగు సినీ సంగీత దర్శకుడు, గాయకుడు, నటుడు రఘు కుంచె తండ్రి లక్ష్మీనారాయణరావు (90) మంగళవారం మరణించారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన ఆయన 1933లో జన్మించారు. భార్య వరహాలమ్మ, కుమారుడు రఘు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో నిర్వహిస్తారు. లక్ష్మీనారాయణరావు స్థానిక సాగునీటి సంఘ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. హోమియో వైద్యుడిగా సేవలందించారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు

ధవళేశ్వరం: స్థానిక కంచర్లలైన్‌లో మంగళవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కంచర్లలైన్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం అండిబోయిన రాజేష్ అనే యువకుడిని కత్తితో పొడిచి బ్లేడ్ బ్యాచ్ సభ్యుడు హత్య చేసిన విషయం తెలిసిందే. దీనిపై కంచర్లలైన్ ప్రాంత వాసులు అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగించారు. మంగళవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి తెలిపారు.

కల్తీ ఆయిల్ ముఠా గుట్టు రట్టు


వధించేందుకు షెడ్‌లో కట్టిన ఆవులు


కల్తీ నూనె డబ్బాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

- పోలీసుల ఆకస్మిక దాడులు
- వధించిన ఆవు, చర్మాలు, కల్తీ ఆయిల్ స్వాధీనం
- జనవాసాల మధ్యలో కబేళా నిర్వహణ
- ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

తుని: గోవులను వధించి మాంసం విక్రయించడంతో పాటు కొవ్వుతో ఆయిల్‌ను తయారు చేస్తున్న ముఠా గుట్టు రట్టు అయింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ముఠా పట్టణ నడిబొడ్డున ఏళ్ల తరబడి కార్యకలాపాలు సాగిస్తున్నా అధికారులు కళ్లు మూసుకున్నారు. కాకినాడకు చెందిన జంతు సంరక్షణ సంస్థ ప్రతినిధి గోపాల్ ఆర్. సూరాబత్తుల ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లడంతో మంగళవారం తుని పట్టణ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పట్టణంలోని జ్యోతినగర్‌లో అనధికారికంగా నిర్వహిస్తున్న కబేళా వెలుగులోకి వచ్చింది. తుని పట్టణ సీఐ ఎం.నాగ దుర్గారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జ్యోతినగర్‌కు చెందిన మహ్మద్ షంషీర్, మహ్మద్ ఆరిఫ్‌లు కబేళాను నిర్వహిస్తున్నారు. వధించిన ఆవుతో పాటు బతికి ఉన్న నాలుగు ఆవులు, 14 చర్మాలు, 74 డబ్బాల(15 కిలోల చొప్పున) కల్తీ నూనెను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎస్సై గోపాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతులు లేకుండా కబేళా నిర్వహణ

గోమాతను పరమ పవిత్రంగా పూజించే సంస్కృతి కలిగిన సమాజంలో వాటిని వధించి ఏ విధమైన అనుమతులు లేకుండా దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గోవులను కొనుగోలు చేసి రాత్రి సమయంలో వధించి మాంసం సేకరించి విక్రయిస్తున్నారు. కొవ్వును తీసి పాత్రలో వేసి మరిగించి నూనె తయారు చేస్తున్నారు. వీటిని డబ్బాల్లో నింపి రాజమహేంద్రవరం ప్రాంతానికి కొంత, స్థానికంగా కిరాణా దుకాణాలు, హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నారు. ఇక వ్యర్థాలను కబేళా పక్కన ఉన్న కాలువలోకి వదులుతున్నారు. దీంతో నీరు కలుషితం అవుతోంది. ఏటా రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. జంతు సంరక్షణ సంస్థ ప్రతినిధులు 2019 నుంచి స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

కల్తీ ఆయిల్‌తో తయారు చేసే పదార్థాలను వినియోగిస్తే జనం రకరకాల వ్యాధుల బారిన పడతారని ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో విక్రయించే డాల్డా, వంట నూనెలో కల్తీ నూనెను కలుపుతున్నారు. ఇది తెలియని ప్రజలు వీటిని కొంటున్నారు. ఇటువంటి వాటిని తయారు చేస్తున్న నిందితులకు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మూడేళ్లుగా పోరాటం



తునిలో జరుగుతున్న గోవధపై మూడేళ్లుగా పోరాటం చేస్తున్నాం. స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం. స్పందన లేకపోవడంతో కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లాం. రెండుమూడు సార్లు తనిఖీలకు వచ్చాం. ముందుగానే వీరికి సమాచారం లీక్ కావడంతో జాగ్రత్త పడ్డారు. ఎట్టకేలకు ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు స్పందించడంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జంతు సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.

– గోపాల్ ఆర్.సూరాబత్తుల, జంతు సంరక్షణ సంస్థ ప్రతినిధి, కాకినాడ

ప్రధాని మోదీ నివాసంలో హరి తాడోజు చిత్రం


హరి తాడోజు గీసిన పెయింటింగ్‌తో ప్రముఖులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరానికి చెందిన చిత్రకారుడు హరి తాడోజు రూపొందించిన పెయింటింగ్‌కు భారత ప్రధాని మోదీ నివాసంలో చోటు దక్కింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో జనవరి 9న 'ప్రవాసీ భారతీయ దివస్' జరిగింది. ఆ కార్యక్రమానికి వెళ్లిన హరి తాడోజు.. ప్రధాని మోదీ తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్నట్టు తాను వేసిన పెయింటింగ్‌ను చికాగోకి చెందిన 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఏషియన్ ఇండియన్ అసోసియేషన్' అధ్యక్షుడు హరీష్ కొలసానికి అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, మారిషస్ అధ్యక్షుడు రాజ్‌కేశ్వార్ పుర్యాగ్, కేంద్రమంత్రులు మురళీధరన్, మీనాక్షి లెఖీ, జయశంకర్ జీ, మన్సుఖ్ మాండవీయ హరి తాడోజు చిత్రాన్ని చూసి అతని ప్రతిభను ప్రశంసించారు. రెండు రోజుల క్రితం హరీష్ కొలసాని ఆ పెయింటింగ్‌ను ప్రధాని నివాసానికి అందజేసినట్టు హరి తాడోజు తెలిపారు.

కుమారుడి హత్యకు తల్లి సుపారీ

వైద్యం అందడంతో ప్రాణాలతో బయటపడ్డ కుమారుడు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

బిక్కవోలు: గత నెల 25వ తేదీన బిక్కవోలు మండలం బలభద్రపురం శివారులోని కానేడు రైల్వేగేట్ వద్ద శివప్రసాద్‌పై జరిగిన హత్యాయత్నానికి అతడి తల్లే సూత్రధారని తమ విచారణలో తేలిందని అనపర్తి సీఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం బిక్కవోలు పోలీస్‌స్టేషన్ వద్ద జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కరప మండలం కూరాడ చిన్నమామిడాడ గ్రామానికి చెందిన కొప్పిశెట్టి కనకదుర్గను భర్త వదిలేయడంతో మనవరాలు సత్యశ్రీతో కలిసి నివసిస్తోంది. ఆమె కుమారుడు వీరవెంకట శివప్రసాద్ భార్యతో గొడవపడి కొంతకాలంగా తల్లి వద్దే ఉంటున్నాడు. అయితే శివప్రసాద్ రోజూ మద్యం సేవించి తల్లి కనకదుర్గను శారీరకంగా, మానసికంగా వేధించడంతో విసిగిపోయిన కనకదుర్గ కుమారుడ్ని అంతమొందించాలన్న నిర్ణయానికి వచ్చింది. తనకు పరిచయమున్న రొక్కాల ఏడుకొండలతో మాట్లాడి సాయం కోరింది. ఏడుకొండలు తనకు సన్నిహితులైన పాట్నిడి వీరవెంకట సత్యనారాయణ, బొల్లెం వంశీకృష్ణలను సంప్రదించి ముగ్గురు కలిసి అతడిని చంపడానికి రూ.1.30 లక్షలు సుపారీకి ఒప్పందం కుదుర్చుకున్నారు. గత నెల 25వ తేదీ రాత్రి కడియంలోని అత్తవారింటి నుంచి వస్తున్న శివప్రసాద్‌ను కానేడు రైల్వేట్రాక్ వద్దకు వచ్చేసరికి ఇనుపరాడ్డుతో తలపై బలంగా కొట్టారు. అయితే శివప్రసాద్ చనిపోయాడని భావించి అక్కడి నుంచి పరారయ్యారు. క్షతగాత్రుడైన శివప్రసాద్‌ను కాకినాడ జీజీహెచ్‌లో చేర్పించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై అతడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ ప్రారంభించిన పోలీసులకు శివప్రసాద్ తల్లే కీలక సూత్రధారిగా తెలిసింది. దీంతో కొప్పిశెట్టి కనకదుర్గతో పాటు హత్యాయత్నానికి పాల్పడిన రొక్కాల ఏడుకొండలు, పాట్నిడి వీరవెంకట సత్యనారాయణ, బొల్లెం వంశీకృష్ణలను అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం 6వ కోర్టులో హాజరుపరచగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.బుజ్జిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'గాడ్' జన్మదిన వేడుకలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు


పీఠంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) 87వ జన్మదిన వేడుకలు భక్తుల కోలాహలం నడుమ మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 19వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహిస్తారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారిని నయనానందకరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు గణపతిహోమం, గరిక పూజ, బిల్వపత్ర పూజ, నక్షత్ర జపం, లక్ష్మీగణపతి, నవగ్రహ, సూర్య, మృత్యుంజయ హోమాలు, ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. దుర్గా అష్టోత్తర, సహస్ర నామావళి, దుర్గా ద్వాత్రింశ నామావళి, దేవీ శక్తిమాల అష్టోత్తరాలతో అమ్మవారిని పూజించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

నేత్రపర్వంగా కార్తికేయుడి కల్యాణం

పీఠంలో ఉదయం 11 గంటలకు తమిళనాడు తిరుత్తణి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ప్రధాన అర్చకులు గురుకుల్ ఆధ్వర్యంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు కడలి కపోతేశ్వరస్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులు కల్యాణాన్ని వీక్షించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అసోసియేట్ రీజనల్ కోఆర్డినేటర్ కందర్ప హనుమాన్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి)ల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

చెట్టును బైక్ ఢీకొని యువకుడి మృతి


సాయికుమార్ మృతదేహం

ప్రత్తిపాడు: చెట్టును బైక్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన ప్రత్తిపాడు మండలం బవురువాక గిరిజన గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు బవురువాక శివారు దోపర్తి గ్రామానికి చెందిన అవివాహితుడు బుర్రా సాయికుమార్ (26) రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. పండగ సెలవులు కావడంతో రాజమహేంద్రవరానికి చెందిన మరో ముగ్గురు స్నేహితులను దోపర్తికి తీసుకుని వచ్చాడు. మంగళవారం రెండు బైక్‌లపై నలుగురు స్నేహితులు సమీప గ్రామాలకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి వెళ్తుతుండగా బవురువాక (ఆంధ్రా శబరిమల రోడ్డు-తుని వారి బీడు) సమీపంలో బైక్ అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న వేపచెట్టును ఢీకొంది. ఈ ఘటనలో బుర్రా సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, అతని స్నేహితుడు జగదీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గాయపడిన జగదీష్‌ను ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేర్చారు. ప్రత్తిపాడు ఎస్ఐ కె.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు

కుటుంబానికి అండగా ఉంటున్న సాయికుమార్ మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బవురువాక శివారు దోపర్తి గ్రామానికి చెందిన బుర్రా దాసు, సూరుడు దంపతులు వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సాయికుమార్ ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు. ఇంటర్ చదువుకున్న సాయికుమార్ రాజమహేంద్రవరంలో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ, తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. స్నేహితులతో సరదాగా గడిపేందుకు స్వగ్రామానికి వచ్చి, మృతి చెందడం తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది.